ఎట్టకేలకు పనులు ప్రారంభం

- అసంపూర్తిగా కేజీబీవీ భవనం
- మంత్రి ఆదేశంతో పనులు పునఃప్రారంభం
- ఈ విద్యాసంవత్సరం అందుబాటులోకి


అక్కన్నపేటలో నిర్మిస్తున్న కేజీబీవీ భవనం

అక్కన్నపేట(హుస్నాబాద్): దాదాపు ఏడాది తర్వాత అక్కన్నపేట మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) భవన నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఈ విద్యాసంవత్సరానికే నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకోరావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో గత వారం నుంచి శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.3.20 కోట్ల వ్యయం తో 2021లో అక్కన్నపేట మండల కేంద్రంలో అప్పటి మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర పాటు పనులు సాఫీగా సాగాయి. మూడంతస్తుల వరకు పనులు చేసి ఆ తర్వాత నిలిపివేశారు. ప్రభుత్వం నుంచి చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్లు తెలిసింది.

అద్దె భవనంలో కేజీబీవీ

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మంజూరైనప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. పరిమితికి మించి విద్యార్థులు ఉండటం, అద్దె భవనంలో అరకొర సౌకర్యాలతో ఉపాధ్యాయులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

తాగునీటి సమస్యలు రావొద్దు

- పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలి
- జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ దేవకిదేవి

హుస్నాబాద్‌రూరల్: ఎండల తీవ్రత పెరుగుతోందని, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని డీపీఓ దేవకీదేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐఓసీ సముదాయంలోని డివిజినల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో అక్కన్నపేట పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి బావుల్లో నీటి లభ్యత తగ్గుతోందన్నారు. మిషన్ భగీరథ నీటిని క్రమం తప్పకుండా గ్రామాల్లో సరఫరా చేయాలన్నారు. తాగునీటి కొరత ఉంటే బావులను అద్దెకు తీసుకొని ప్రజలకు తాగునీటిని అందించాలని దీనికి ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామానికి 50 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో మురుగు నీరు నిలిచే చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే పారిశుద్ధ్య నిర్వహణ సులభమవుతుందన్నారు. కొత్త ఇంటి నిర్మాణలకు కార్యదర్శులు మోక విచారణ చేసి అనుమతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం చేయండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి

హుస్నాబాద్: రానున్న ఎన్నికల్లో మోదీని, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని శుక్రవారం పార్టీ పట్టణ కార్యకర్తల సమావేశం పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆరపల్లె, గోదాంగడ్డ, ఎల్లంబజార్ ఏరియాలో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తోట స్వరూప, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, నాయకులు కొత్తపల్లి అశోక్, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, చందు, తోట సమ్మయ్య, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై ప్రశ్నించే బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1వ వార్డులో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు జాతీయ రహదారి తెచ్చింది వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, కౌన్సిలర్లు కొంకట నళినీదేవి, పెరుక భాగ్యరెడ్డి, గోవిందు రవి, అయిలేని శంకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

చెట్లు తొలగించాలని వినతి

సిద్దిపేటజోన్: సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలోఉన్న అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న చెట్ల ను తొలగించాలని దళిత సంఘర్షణ సమితి నా యకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణికి వినతిపత్రం అందజేశారు. చెట్లు ఏపుగా పెరగడంతో విగ్రహం కనబడటంలేదన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉత్తమ ఫలితాలు సాధించాం

సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శారద


మార్కులు సాధించిన విద్యార్థినులతో అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: తమ కళాశాల విద్యార్థినులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శారద అన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థినులను శుక్రవారం అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ సీనియర్ అధ్యాపకులతో బోధన, స్టడీ అవర్స్ నిర్వహణతోపాటు చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతో ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. ఫస్టియర్‌లో 400లకు పైగా ఏడుగురు , సెకండియర్‌లో 900లకుపైగా ఏడుగురు విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సుల్లో 50 శాతం, ఒకేషనల్ కోర్సుల్లో 69 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సుల్లో 41 శాతం, ఒకేషనల్ కోర్సుల్లో 64 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమాదేవి, శారద, ప్రసాద్, హుస్నా తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారెంటీలు అమలు చేస్తాం


ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా శుక్రవారం బెజ్జంకిలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానికేతరులు, అభివృద్ధి చేయని బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు గుణపాఠం చెప్పి రాజేందర్‌రావును అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. దేశంలో అధికారంలోకి రావడానికి ఎంపీలను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మాట్లాడుతూ మతం పేరుతో ఓట్లను చీల్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. బీజేపీకీ హఠావో, దేశ్‌కి బచావో అని నినదించారు. తనని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ


అక్కన్నపేటలో బొడ్రాయికి పూజ చేస్తున్న గామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బొడ్రాయికి ఎంపీటీసీ సభ్యులు పెసరు సాంబరాజు, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి తదితరులు పూజలు చేశారు. గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు.

బోయినపల్లి పూజలు

అక్కన్నపేట మండల కేంద్రంలో జరిగిన దుర్గామాత విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి ఎల్.రూప్‌సింగ్ నాయక్, కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, నాయకులు భూక్యా శ్రీనివాస్, రాంరెడ్డి, సక్కా రాజు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల పరిధి లద్నూర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం గ్రామంలో నాభిశిలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం బొడ్రాయి వద్ద దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో వేదపండితులు రాజేశ్‌శర్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఇర్రి రాజిరెడ్డి, పుట్ట వెంకటరమణరెడ్డి, పద్మారెడ్డి, గుజ్జుక సమ్మయ్య, సుదర్శన్, కనకాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొడ్రాయికి పూజలు

ఆశీర్వదించండి: వెంకట్రామిరెడ్డి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పదేళ్ల పాలనలో పచ్చని పంటలు, నాలుగు నెలల పాలనలో రాష్ట్రం ఎడారిగా మారిందని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేదని, ప్రస్తుత ఎడారిగా మారిందన్నారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో గజ్వేల్ ప్రాంతం అభివృద్ధిలో 30 ఏళ్లు ముందుకు పోయిందన్నారు. ప్రజా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తున్నాడన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కవిత తదితరులు పాల్గొన్నారు.

‘ఫసల్ బీమా’ అమలు చేయాలి

బీజేపీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి


కాలిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఫసల్ బీమా యోజనను తెలంగాణలో అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. మండలంలోని అలిరాజ్‌పేటలో రైతు ప్రభాకర్‌రెడ్డి మొక్కజొన్న పంట దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు శుక్రవారం కాలిన పంటను పరిశీలించారు. పంట నష్టం జరిగిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తన నియోజకవర్గంలో రైతులు ఇబ్బందులు పడుతున్నా ఆయన పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫసల్ బీమా యోజన అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, ఓబీసీ విభాగం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండలాధ్యక్షుడు ఐలయ్య, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు పర్వతాలు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అధికార ప్రతినిధి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పిల్లల భద్రతపై జాగ్రత్తలు తప్పనిసరి



సిద్దిపేటకమాన్: వేసవి సెలవుల్లో పిల్లల భద్రత పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలను ఒంటరిగా చెరువులు, కుంటలు, బావుల్లో ఈత కొట్టేందుకు పంపించొద్దన్నారు. బైక్, కారు తాళాలు పిల్లలకు అందుబాటులో ఉంచకూడదని, మొబైల్ ఫోన్ ఎలా వినియోగిస్తున్నారో గమనించాలన్నారు. అపార్ట్‌మెంట్లలో ఉండే పిల్లలు లిఫ్ట్ కేబిన్‌లోకి ఒంటరిగా వెళ్లకుండా చూసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలను దూర ప్రాంతాలకు, పిక్నిక్, టూర్‌లకు పంపకూడదన్నారు. సెలవుల్లో పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ సంస్కృతి, సాంప్రదాయాలు, నైతిక విలువల గురించి తెలపాలన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్


మాట్లాడుతున్న సదానందం గౌడ్

సిద్దిపేటజోన్: ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట పబ్లిక్ సర్వెంట్స్ హోమ్‌లో జరిగిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఏళ్ల తరబడి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పెండింగ్‌లో ఉండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతికి అడ్డంకిగా మారిన టెట్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రంగారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, జిల్లా అధ్యక్షుడు భూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవసరమైతేనే బయటకు వెళ్లాలి


హోమియో గుళికలు వేస్తున్న డాక్టర్ దేవేందర్

కొండపాక(గజ్వేల్): రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయని, అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని హోమియో వైద్యుడు వల్లకోటి దేవేందర్ అన్నారు. కొండపాకలోని ఆనంద నిలయంలోని వృద్ధులకు హోమియోపతి మందులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లుగా ఉచితంగా వడదెబ్బ నివారణ మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ ఇన్‌చార్జి అరుణ అమర్నాథ్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారు రాజీవ్ రహదారిపై కొమురవెల్లి మల్లన్న స్వామి కమాన్ వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా అటవీ శాఖ అధికారి కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రేంజ్ అధికారి విక్రమొద్దీన్, సెక్షన్ అధికారి సాయిరాం పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల పరిధి జాలపల్లి గ్రామంలో చౌడాలమ్మ, మల్లన్నస్వామి ఆలయాలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. జాలపల్లి గ్రామ మురళీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గమ్మ ఉత్సవాలు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల పరిధిలోని బైరాన్‌పల్లి గ్రామంలో ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్న దుర్గమ్మ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. మాజీ ఎమ్మెల్యే నాగపూరి రాజలింగం, ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద యాదగిరి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను ఉత్సవ కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉత్సవాల్లో ఎంపీటీసీ సభ్యుడు నర్సింహులు, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లేశం, ఉత్సవ కమిటి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5.11 లక్షలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సమర్పించిన కానులక హుండీని శుక్రవారం ఎండోమెంట్ డివిజన్ పరిశీలకుడు రంగారావు తదితరుల సమక్షంలో తెరిచినట్లు ఈఓ పీవీ శర్మ తెలిపారు. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటి వరకు భక్తులు స్వామివారికి సమర్పించిన కానులు, వెండి బంగారు ఆభరణాలను భక్తులు లెక్కించారు. మొత్తం రూ.5,11,971 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వెండి, బంగారు కానులను హుండీలోనే భద్రపరిచారు. కార్యక్రమంలో సిబ్బంది సునీత, ప్రవీణ్, గ్రామ కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, టీడీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మతం పేరుతో బీజేపీ రాజకీయం

దుబ్బాకటౌన్: మతం పేరుతో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజకీయం చేస్తోందని ధర్మ సమాజ్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి అన్నెల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. నీలం మధు కేవలం రాజ కీయ లబ్ధి కోసమే పార్టీలు మారుతున్నాడని ఆరోపించారు. చెప్పు గుర్తుకు ఓటు వేసి ధర్మసమాజ్ పార్టీని గెలిపించాలని కోరారు.

నగదు పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలులేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. శుక్రవారం సిద్దిపేటకు చెందిన గట్టు విజయ్ తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,21,200 నగదును సీజ్ చేశామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **29న దుకాణాల వేలం**

హుస్నాబాద్: ఎల్లమ్మ జాతర పురస్కరించుకొని ఈనెల 29వ తేదీన దుకాణాల ఏర్పాటుకు హుస్నాబాద్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో టెంకాయలు, పూజా సామగ్రి, లడ్డూ పులిహోర తదితర దుకాణాలు ఏర్పాటుకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పందిళ్లు, క్యూ లైన్లు, ఎలక్ట్రికల్ డెకరేషన్, కేటరింగ్, దేవాలయ ప్రాంగణం శుభ్రం చేయడానికీ వేలం నిర్వహిస్తామన్నారు.

◆ **జహంగీర్‌ను గెలిపిద్దాం**

మద్దూరు(హుస్నాబాద్): భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ అన్నారు. శుక్రవారం దూళ్మిట్ట మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో హమాలీ కార్మికులతో మాట్లాడారు. కార్మిక వర్గానికి నిరంతరం అండగా ఉండేది కేవలం సీపీఎం మాత్రమేనన్నారు.

◆ **మే 1 నుంచి హ్యాండ్ బాల్ శిక్షణ శిబిరం**

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలో మే 1 నుంచి 31 వరకు సిద్దిపేట జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణ ఇస్తున్నట్లు మద్దూరు మండల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లలోపు బాలబాలికలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ **మళ్లీ బీఆర్ఎస్ పాలనకు మొగ్గు**

ములుగు(గజ్వేల్): రాబోయే ఎంపీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ములుగు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహ్మద్ జహంగీర్ కోరారు. మండలంలోని కొత్తూరులో పార్టీ శ్రేణులతో కలసి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తరఫున శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలనే కోరుకుంటున్నారన్నారు. ఆయా పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **బస్సు సర్వీస్‌లు పునరుద్ధరించాలి**

హుస్నాబాద్: హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించి, డిపోకు కొత్త బస్సులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ శుక్రవారం డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని బస్‌డిపో అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రతీరోజు ఉదయం 5 గంటలకు నడిచే సూపర్ లగ్జరీ బస్ సర్వీస్‌ను ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో ప్రయాణికులు నానా అవస్థలుపడుతున్నారని తెలిపారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను తెప్పించి ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని కోరారు.

◆ **అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు**

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ పోలీసులు హెచ్చరించారు. మండల పరిధిలోని ఆరెపల్లి(ఎస్‌బీ)లో మహ్మద్ మతిన్ తన కిరాణా దుకాణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. 40.400 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

◆ **ఆత్మగౌరవ పత్రిక పుస్తకావిష్కరణ**

సిద్దిపేటజోన్: సమ్మక్క సారలమ్మ జాతర విశిష్టతపై బండి ఉష రాసిన ఆత్మ గౌరవ పత్రిక పుస్తకాన్ని శుక్రవారం కవులు ఆవిష్కరించారు. సిద్దిపేటకు చెందిన 15 మంది కవుల కవితలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు అంజయ్య, సుధాకర్, లక్ష్మయ్య, లక్ష్మీ పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంతో పాటు చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ **స్పీకర్ ఫార్మెట్‌లో ఇవ్వాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరు గ్యారంటీలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఎమ్మెల్యే హరీశ్ రావు స్పీకర్ ఫార్మెట్‌లో రాజీనామా చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో మాట్లాడారు. హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రిగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.